

ఎన్నికల విధుల నుంచి మినహాయించండి

● కలెక్టర్‌కు విన్నవించుకున్న ఏపీటీఎఫ్

కలెక్టరేట్, మార్చి 30: దీర్ఘకాలిక వ్యాధులు, గుండె జబ్బులు, క్యాన్సర్ తదితర వ్యాధులతో బాధపడుతున్న ఉపాధ్యాయులకు ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరుతూ ఏపీటీఎఫ్ 1938 జిల్లా సంఘ నాయకులు శనివారం కలెక్టర్ నాగలక్ష్మికి వినతిపత్రం ఇచ్చారు. అలాగే గర్భిణులు, బాలింతలకు కూడా మినహాయింపు ఇవ్వాలని కోరారు. ఉద్యోగ విరమణకు ఒక సంవత్సరం సర్వీసు ఉన్నవారికి కూడా ఊరటనివ్వాలని కోరారు. సంఘ నాయకులు పైడిరాజు, ఎర్ని నాయుడు, సోమశేఖర్ తదితరులు కలెక్టర్‌ను కలిశారు.



పేరుకే ఫిజియోథెరపీ

● పెద్దాసుపత్రిలో కానరాని కీలక వైద్యం
● డాక్టర్లున్నా ఉపయోగం లేని వైనం
● మూలకు చేరిన పాత పరికరాలు
● కొత్తవి సమకూర్చని ప్రభుత్వం
● రోగులకు ప్రైవేటు ఆసుపత్రులే గతి





పనిచేయని షార్ట్‌వేవ్ డయాథెర్మి పరికరం

శరీరంలో ఏదైనా అవయవం ప్రమాదానికి గురైనా.. చచ్చుబడినా... మునుపటి స్థితికి తీసుకురావడానికి చేసే ప్రయత్నమే ఫిజియోథెరపీ. జిల్లాలోని పేదలకు ఏ అనారోగ్య సమస్య వచ్చినా ముందు గుర్తుకొచ్చేది విజయనగరంలోని ప్రభుత్వ సర్వజనాసుపత్రే. పెద్ద ఆస్పత్రిగా చెప్పుకుంటారు. కానీ కీలకమైన ఫిజియోథెరపీ వైద్యం కోసం వెళ్లేవారికి అక్కడ నిరాశే ఎదురవుతోంది. ఎన్నిసార్లు వెళ్లినా రోగం తగ్గడం లేదు. కారణం కీలకమైన పరికరాలు పనిచేయకపోవడమే. దీంతో చేసేదిలేక ప్రైవేటు ఆస్పత్రిని ఆశ్రయిస్తున్నారు. ప్రధానంగా రోగులకు నొప్పి నివారణకు ఉపయోగించే షార్ట్‌వేవ్ డయాథెర్మి పరికరం నెల రోజులుగా మూలకు చేరింది. వైద్యులు ఉన్నా ఉపయోగం ఉండడం లేదు.

(విజయనగరం రింగురోడ్డు)

జీవన శైలిలో లోపాల వల్ల ఓదైనా అవయవానికి హాని కలిగినప్పుడు కాని, ప్రమాదాల్లో గాయాలైనప్పుడు కాని, నొప్పులతో బాధపడేవారికి కాని ఫిజియో థెరపీ అవసరం ఉంటుంది. జిల్లా ప్రజలు ఎలాంటి అనారోగ్య సమస్యలు ఎదురైనా పెద్దాసుపత్రికే క్యూ కడతారు. ఫిజియో థెరపీ కోసం అక్కడికి వెళ్లేవారు చాలా వరకు అసంతృప్తితో బయటకు వస్తున్నారు. చివరకు విసిగి మళ్లీ ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. జిల్లా ప్రభుత్వ సర్వజనాసుపత్రి బోధనాస్పత్రిగా మారడంతో మరిన్ని వైద్య సదుపాయాలు లభిస్తాయని ప్రజలు ఆశించారు కాని స్థాయి పెరిగినా వైద్యం మెరుగవ్వలేదు. సదుపాయాలూ పెరగలేదు.

ఫిజియోథెరపీని నిర్దేశిత పద్ధతులు, వ్యాయామాలు, ఉపకరణాల ద్వారా సాంత్వన చేకూర్చుతారు. ప్రభుత్వ సర్వజనాసుపత్రిలో ముగ్గురు ఫిజియో థెరపిస్టులు, ఒక రియాబిలిటేషన్ వర్కర్, సిబ్బంది ఉన్నారు. రోగులకు చికిత్స అందించే ఫిజియోథెరపీ పరికరాలు చాలా వరకూ మరమ్మతులకు గురయ్యాయి. కొత్తవి రావడం లేదు. దీంతో సిబ్బంది ఖాళీగా కూర్చునే పరిస్థితి ఏర్పడింది. ప్రధానంగా రోగులకు నొప్పి నివారణకు ఉపయోగించే షార్ట్‌వేవ్ డయాథెర్మి నెల రోజులుగా మరమ్మతులకు గురైంది. బాగుచేసే నాథుడు లేడు. మిగిలిన పరికరాలు కూడా అంతంత మాత్రంగానే ఉన్నాయి. రోజుకు 100 మందికి పైగా రోగులు ఫిజియోథెరపీ చేయించుకునేందుకు ఇక్కడకు వస్తుంటారు. కొత్త పరికరాలు లేకపోవడం, పాతవి పనిచేయకపోవడంతో వేరే దారి లేక వైద్యులే బయటకు పంపిస్తున్నారు. బయట ఫిజియోథెరపీ కేంద్రాల్లో ఒక రోగి నుంచి గంటకు రూ.1,000 వసూలు చేస్తున్నారు. దీంతో పేదవారు ఫిజియో థెరపీ చేయించుకోలేకపోతున్నారు.

● ఆసుపత్రిలో వివిధ అవయవాలకు శస్త్ర చికిత్సలు పూర్తయిన వారికి ఫిజియోథెరపీకి సిఫార్సు చేస్తున్నారు. పరికరాలు లేకపోవడం వల్ల రోగులు ఇబ్బందులు పడుతున్నారు. పాత పరికరాలు మార్చి కొత్తవాటిని తీసుకురావాల్సి ఉంది. వైద్యశాఖ అధికారులు ఇక్కడి పరిస్థితిపై దృష్టి కేంద్రీకరించడం లేదన్న అభిప్రాయం రోగుల నుంచి వ్యక్తమౌతున్నది. మరోవైపు మహిళల విషయానికి వస్తే వారికి ఫిజియోథెరపీ కేంద్రం ప్రత్యేకంగా ఉండాలి. అదీ లేదు. గతంలో ఉన్న ఓ గదిని ఏఆర్‌టీ కౌన్సిలింగ్ కేంద్రానికి కేటాయించేశారు. ఆసుపత్రిలో సమస్యలు చెప్పుకునేందుకు, ఫిర్యాదులు అందించేందుకు హెల్ప్‌డెస్క్ గాని, కనీసం వారి ఫోన్ నెంబర్లు కూడా కనిపించవు. ఎవరిని అడిగినా.. నెంబర్లు చెప్పరు.

ఫిజియోథెరపీ సేవలపై సూపరింటెండెంట్ డాక్టరు పి అనిలా సునందని వివరణ కోరగా, త్వరలోనే ఫిజియోథెరపీ విభాగంలో మరమ్మతులకు గురైన పరికరాలను బాగు చేయించి అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు.



వైద్యం కోసం నిరీక్షిస్తున్న రోగులు(ఫైల్)

సీఎం బొమ్మతో చిక్కులు

● సచివాలయాలు, మీసేవ కేంద్రాల్లో కొత్త స్టేషనరీ కొరత
● ఈసీ ఆదేశంతో పాత వాటిపై నిషేధం ● ధ్రువ పత్రాల కోసం ప్రజల ఇబ్బందులు

కలెక్టరేట్, మార్చి 30:



గంట్యాడ మండలంలోని ఓ గ్రామానికి చెందిన రైతుకు గత ఏడాది బ్యాంకు ద్వారా తీసుకున్న వ్యవసాయ రుణం రెన్యూవల్ చేసుకోవడం కోసం 1బీ అవసరం పడింది. గ్రామ సచివాలయానికి వెళ్లాడు. సీఎం ఫొటో లేని కొత్త స్టేషనరీ ఇంకా రాలేదని, ధ్రువపత్రం ఇవ్వడానికి సమయం పడుతుందని సిబ్బంది తెలపడంతో నిరాశతో వెనుతిరిగాడు. ఇటువంటి సమస్యలను విద్యార్థులు, ఇతరులు కూడా ఎదుర్కొంటున్నారు.

పది సంవత్సరాల క్రితం వివిధ రకాల ధ్రువపత్రాలను ఆన్‌లైన్‌లో జారీ చేయాలన్న ఉద్దేశంతో మీసేవ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎవరికైనా ధ్రువ పత్రాలు కావాలంటే మీసేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకునేవారు. సంబంధిత అధికారులు ఆమోదించిన తరువాత ఆయా ధ్రువ పత్రాలను మళ్లీ మీసేవలోనే తీసుకునేవారు. అప్పట్లో స్టేషనరీపై రాజకీయ నాయకులు ఫొటోలు ఉండేవి కావు. మీసేవ సింబల్‌తో పాటు ప్రభుత్వ ఏంబ్లమ్ మాత్రమే ఉండేది. ఎన్నికల జరిగే సమయంలో కూడా ఈ స్టేషనరీ పేపర్లు వినియోగించే వారు. దీనివల్ల ఎవరికీ ఇబ్బంది ఉండేది కాదు. 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కొత్తగా గ్రామ, వార్డు సచివాలయం వ్యవస్థను ఏర్పాటు చేశారు. అనంతరం అప్పటివరకు ఉన్న స్టేషనరీని నిలిపివేసి కొత్త పేపర్లను అందుబాటులోకి తీసుకువచ్చారు. ఆ స్టేషనరీపై సీఎం చిత్రంతోపాటు నవ రత్నాలు, గవర్నమెంట్ ఏంబ్లమ్ ఉన్నాయి. ఈ స్టేషనరీపైనే 1బి, అడంగల్, కుల, ఆదాయ, నివాస ధ్రువ పత్రాలతోపాటు, మరణ, జనన సర్టిఫికెట్‌లు అందజేస్తున్నారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో సీఎం ఫొటోతో అందజేస్తున్న స్టేషనరీ నిలిపివేయాలని ఎన్నికల కమిషన్ ఆదేశాలు ఇచ్చింది. దీంతో ప్రతి సచివాలయానికి 15 నుంచి 25 వరకూ సీఎం బొమ్మలు లేని కొత్త స్టేషనరీ పేపర్లను పది రోజుల క్రితం అందజేశారు. అవి అయిపోవడంతో సిబ్బంది ఏమి చేయలేక మిన్నకుండి పోతున్నారు. ప్రస్తుతం వివిధ పోటీ పరీక్షలకు నోటిఫికేషన్లు విడుదల కావడంతో నిరుద్యోగులు కుల, ఆదాయ, నివాస పత్రాల కోసం సచివాలయాలను ఆశ్రయిస్తున్నారు. సచివాలయాలు, మీసేవ కేంద్రాల్లో స్టేషనరీ కొరత వల్ల సర్టిఫికెట్లు అందుకోలేక ఇబ్బంది పడుతున్నారు. ఇదే విషయాన్ని గ్రామ,వార్డు సచివాలయం జిల్లా కోఆర్డినేటర్ నిర్మాల దేవి వద్ద ప్రస్తావించగా ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో సీఎం ఫొటోలు ఉన్న స్టేషనరీ నిలిపేశామని, కొత్త స్టేషనరీని ప్రతి సచివాలయానికి మొదట్లో 30 పేపర్లు చొప్పున అందజేశామన్నారు. ప్రస్తుతం మరో 100 పేపర్లు చొప్పున పంపిణీ చేశామని తెలిపారు.



చెక్‌పోస్టు సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ దీపిక

ప్రతి వాహనాన్నీ తనిఖీ చేయండి

● అంతర్ జిల్లా చెక్‌పోస్టును పరిశీలించిన ఎస్పీ దీపిక

బొబ్బిలి, మార్చి 30: ప్రతి వాహనాన్నీ క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, ఓటర్లను ప్రలోభపెట్టేందుకు అక్రమంగా ఏవీ రవాణా చేయకుండా కట్టడి చేయాలని ఎస్పీ దీపిక పోలీసు సిబ్బందిని ఆదేశించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పాతబొబ్బిలి జంక్షన్‌లో ఏర్పాటు చేసిన అంతర్‌జిల్లా చెక్‌పోస్టును ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. పొరుగు జిల్లాల నుంచి వచ్చే వాహనాలను పోలీసులు తనిఖీ చేస్తున్న తీరు, రికార్డుల్లో నమోదు తదితర అంశాలపై ఆరా తీశారు. ఓటర్లను ప్రలోభపెట్టేందుకు రాజకీయపార్టీలు మద్యం, సారా, గంజాయి, నగదు, ప్రోత్సాహక బహుమతులు, చీరలు, వాచీలు వంటి కానుకలను తరలించే అవకాశం ఉందని, నిఘా పెట్టి పూర్తిగా కట్టడి చేయాలన్నారు. వాహనాల తనిఖీల్లో ఇలాంటివేవైనా కనిపిస్తే వెంటనే వాహనాలను, ఆ వస్తుసామగ్రిని సీజ్ చేయాలన్నారు. బాధ్యులను గుర్తించి వారిపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు.

● బొబ్బిలి మండలం మెట్టవలస, పారాది గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను కూడా ఎస్పీ సందర్శించి భద్రతా చర్యలపై ఆరా తీశారు. పోలింగ్ కేంద్రాలకు వందమీటర్ల పరిధిలో ఓటుహక్కు వినియోగించుకునే వారు తప్ప ఇతరులెవరినీ అనుమతించవద్దని ఆదేశించారు. ఆమె వెంట బొబ్బిలి డీఎస్‌పి పి.శ్రీనివాసరావు, సీఐ మలిరెడ్డి నాగేశ్వరరావు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది ఉన్నారు.

సూర్య ప్రతాపం



విజయనగరంలో శనివారం కాసిన ఎండ కాకపుట్టించింది. ఇంటినుంచి బయటకు వస్తే సుర్రుమంది. పిల్లలు, వృద్ధులు ఎండకు తాళలేకపోయారు. ఫుట్‌పాత్ వ్యాపారులు ఉదయం 10 గంటల తరువాత దుకాణాలు మూసివేశారు. మరోవైపు వడగాడ్పులతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. రోడ్లు, మార్కెట్‌లు, ముఖ్య కూడళ్లు వెలవెలబోయాయి. రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. గరిష్ట ఉష్ణోగ్రత 40 డిగ్రీలుగా నమోదైంది. జిల్లాలోని చాలా ప్రాంతాల్లో ఇదే తరహాలో ఎండలు మండాయి.
- విజయనగరం (ఆంధ్రజ్యోతి)

నిర్మానుష్యంగా పెద్దచెరువు రోడ్డు




వేతనాలు పెంచుతూ ఉత్తర్వులు

ఉపాధి వేతనదారులకు వేతనం పెంచుతూ ఉత్తర్వులు అందాయి. ఇప్పటివరకు గ్రామాల్లో రిజర్వు ఫారెస్టురైట్స్ ప్రకారం సుమారు ఆరు లక్షల రూపాయలు వెచ్చించి భూములను అభివృద్ధి చేశాం. వచ్చే ఏడాది మైనర్ ఇరిగేషన్ పనులకు ప్రాధాన్యం ఇస్తున్నాం. జూన్ నుంచి ఖరీఫ్ పనులు చేపడతాం.
- ఎ.లక్ష్మీపతిరాజు, ఏపీవో

ఉపాధి వేతనం పెంపు

● రేపటి నుంచి అమలు
● రూ. 272 నుంచి రూ.300కు పెంచుతూ కేంద్రం నిర్ణయం

బొబ్బిలి, మార్చి 30: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనులు చేసే వేతనదారులకు రోజువారీ కూలి రేటును కేంద్ర ప్రభుత్వం పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. రూ.272 ఉన్న వేతనాన్ని రూ.300కు పెంచింది. ఈ నిర్ణయంతో జిల్లాలో సుమారు ఐదు లక్షల మంది జాబ్‌కార్డుదారులకు ప్రయోజనం చేకూరుతుంది. బొబ్బిలి మండలంలో మొత్తం ఇరవైవేల మంది వేతనదారులు ఉండగా అందులో కచ్చితంగా పనులు చేసే వారు 14, 500 మంది ఉన్నారు. పెరుగుతున్న జీవన వ్యయానికి అనుగుణంగా ఏటా కూలిరేట్లను ప్రభుత్వం పెంచుతోంది. 2018-19లో రూ.205 ఉండే కూలిని వరుసగా రూ.211, రూ.237, రూ.245 , రూ.272, రూ.300 చొప్పున పెంచుతూ వచ్చింది. ఐదేళ్ల వ్యవధిలో 25.36 శాతం వేతనం పెరిగింది. ఈ పనులకు సంబంధించి జాతీయ స్థాయిలో ఒకే సాఫ్ట్‌వేర్‌ను తాజాగా అమలులోకి తెచ్చారు. ఉదయం 6 నుంచి 11 గంటల వరకు, మళ్లీ మధ్యాహ్నం 3 నుంచి 6 గంటల వరకు వేతనదారులు పనులు చేయాలన్న నిబంధనను ప్రస్తుతం అమలు చేస్తున్నారు.



మూల్యాంకనంలో నిమగ్నమైన ఉపాధ్యాయులు(ఫైల్)

ఏర్పాట్లు పక్కాగా చేశాం

మూల్యాంకనం నిర్వహించేందుకు పక్కాగా ఏర్పాట్లు చేశాం. నియామకమైన సిబ్బంది ఖచ్చితమైన సమయానికి హాజరు కావాలి. మూల్యాంకనం జరిగే సమయంలో సెల్‌ఫోన్లు వినియోగించకూడదు. జిల్లాకు 1,70,162 జవాబుపత్రాలు వచ్చాయి. సిబ్బందికి రోజుకు రెండుసార్లు మజ్జిక అందజేస్తాం.
- ప్రేమకుమార్, డీఈవో

టెన్త్ మూల్యాంకనానికి సిద్ధం

● జిల్లాకు 1,70,162 జవాబు పత్రాల కేటాయింపు
● విధుల్లో 990 మంది సిబ్బంది

కలెక్టరేట్, మార్చి30: పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనానికి జిల్లా విద్యాశాఖ ఏర్పాట్లు పూర్తి చేసింది. సోమవారం నుంచి ఏప్రిల్ 8వ తేదీ వరకూ పట్టణంలోని సెయింట్ జోసఫ్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో నిర్వహించేందుకు అంతా సిద్ధం చేశారు. ప్రతి రోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ సిబ్బంది విధుల్లో ఉంటారు. జిల్లాకు 1,70,162 జవాబు పత్రాలు కేటాయించారు. ఇందులో తెలుగు 24,342, హిందీ 23,338, ఇంగ్లీష్ 21,259, గణితం 17,511, భౌతిక శాస్త్రం 29,672, జీవ శాస్త్రం 24,360, సాంఘిక శాస్త్రం 29,680 జవాబు పత్రాలను కేటాయించారు. వీటిని మూల్యాంకనం చేసేందుకు 104 మంది చీఫ్ ఎగ్జామినర్లు, 624 మంది సహాయక ఎగ్జామినర్లు, 208 మంది స్పెషల్ అసిస్టెంట్లు మొత్తం 990 మంది సిబ్బందిని నియమించారు. ప్రతి గ్రూపులో ఒక చీఫ్ ఎగ్జామినర్, ఆరుగురు సహాయక ఎగ్జామినర్లు, ఇద్దరు స్పెషల్ అసిస్టెంట్లు ఉంటారు. ప్రతి సహాయక ఎగ్జామినర్ రోజుకు 40 పేపర్లు మూల్యాంకనం చేయాల్సి ఉంది. మూల్యాంకనం చేస్తున్న సమయంలో సెల్‌ఫోన్ వినియోగించకూడదు. మూల్యాంకనం కోసం ఫర్నీచర్, విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు వంటి సదుపాయాలు కల్పిస్తున్నారు.

టీడీపీకి అండగా బ్రాహ్మణ కుటుంబాలు

రామభద్రపురం: జిల్లాలో ఉన్న బ్రాహ్మణ కుటుంబాలు టీడీపీకి అండగా ఉంటాయని సమరసతా సేవా ఫౌండేషన్ జిల్లా కన్వీనర్ బాదంపూడి నాగరామ లింగేశ్వర శర్మ తెలిపారు. ఇటీవల బ్రాహ్మణ నాయకుడు సంతోష్ కుమార్ మరణంతో ఆ కుటుంబాన్ని తెలుగుదేశం పార్టీ ఆదుకుని రూ.25 వేల చెక్కు అందజేయడం హర్షణీయమని అన్నారు. టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు పూసపాటి అశోక్‌గజపతిరాజు చెక్కును అందించారని తెలిపారు. ఈ సమావేశంలో వెలవలపల్లి శ్రీనివాసులుశర్మ, హర్షవర్దన్, కాళ్లకూరు బుచ్చిబాబు, బల్జేపల్లి శ్రీకాంత్, తెలగాపు రవిశర్మ, బ్రహ్మజీ, తులగాపు మూర్తి పాల్గొన్నారు.

వడదెబ్బపై అవగాహన

లక్కవరపుకోట: మండలంలో వడదెబ్బ నివారణకు విస్తృత ప్రచారం చేపట్టారు. అన్ని గ్రామాల్లో దండోరా వేయాలని, చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని ఎంపీడీవో కే.రూపేష్ ఆదేశాలిచ్చారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున ప్రజలు బయటకు వెళ్లొద్దని సూచిస్తూ వియ్యంపేట పీహెచ్‌సీ వైద్యాధికారి గోపాలకృష్ణ ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం చేపట్టారు.

నేడు కోండ్రు ప్రచారం

రాజాం: గడిముడిదాం పంచాయతీ పరిధిలోని సీఎస్ఆర్ పురం, అమరాంల్లో టీడీపీ రాజాం నియోజకవర్గ అభ్యర్థి కోండ్రు మురళీమోహన్ ఆదివారం ఉదయం ఎన్నికల ప్రచారం చేయనున్నారు. సాయంత్రం సంతకవిటి మండలంలోని మండాకురిటి పంచాయతీలో జరగనున్న జయహో బీసీ కార్యక్రమంలో పాల్గొనున్నట్లు కోండ్రు తెలిపారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

రాజాం రూరల్: చంద్రబాబునాయుడితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ విజయనగరం లోక్ సభ నియోజకవర్గ అధికార ప్రతినిధి వంగా వెంకట రావు తెలిపారు. మండలంలోని ఒమ్మి, బొమ్మినా యడువలసలో టీడీపీ రాజాం రూరల్ అధ్యక్షుడు సుమల మన్మథరావు తదితరులతో కలిసి శనివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. సర్పంచ్‌లు రఘుమండల గణపతి, కొయ్యాన జగదీష్ పాల్గొన్నారు.

తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి



వాహన చోదకులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

తెర్లాం: తెర్లాం అడ్డు రోడ్డు కూడలిలో స్థానిక ఎస్.ఐ. రమేష్ వాహన చోదకులకు హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పించారు. ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. లేనిపక్షంలో అపరాధ రుసుం విధిస్తామని స్పష్టం చేశారు. ఆయనతోపాటు హెడ్ కానిస్టేబుల్ ఎ.వి.పి.రాజు, ఆర్.రాజు తదితరులు పాల్గొన్నారు. **రామభద్రపురం:** మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ జ్ఞానప్రసాద్ హెచ్చరించారు. కొట్టక్కి, మిర్తివలస వద్ద శనివారం తనిఖీలు నిర్వహించారు. వాహన చోదకులకు డ్రంక్ అండ్ డ్రైవ్, ఓపెన్ డ్రింకింగ్ టెస్టులు చేసి.. ఇద్దరిపై కేసు నమోదు చేశారు.

టీడీపీ బ్రాహ్మణ విభాగం ప్రచారం

విజయనగరం రూరల్ : నగరంలోని 9, 10 డివిజన్ల పరిధిలో శనివారం టీడీపీ బ్రాహ్మణ విభాగం నాయకులు డాక్టర్ పేరి రామయ్య పంతులు, వడ్డమాని శేఖర్, సుభద్ర, ద్వాదశి వేణుశ్రీనివాస్, సన్యాసిరావు, రమణమూర్తి తదితరులు ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థి అదితి గజపతిరాజు, ఎంపీ అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడును గెలిపించాలని కోరారు.

ఐక్యంగా పనిచేయాలి

రాజాం: ఐక్యంగా పనిచేస్తే టీడీపీ విజయం తథ్యమని తూర్పు కాపు కార్పొరేషన్ మాజీ చైర్మన్ కొల్ల అప్పలనాయుడు తెలిపారు. శనివారం సంతకవిటి మండలంలో చిన్నయ్యపేటలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో కోండ్రు జగదీష్‌లో కలిసి మాట్లాడారు. టీడీపీ గెలుపుకోసం నిరంతరం కష్టపడి పనిచేయాలన్నారు. రాష్ట్రంలో టీడీపీ విజయం కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో గట్టి భాను, వల్లూరు గణేష్ పాల్గొన్నరు.

7న గుంటూరులో బహిరంగ సభ

విజయనగరం రూరల్: ఎస్సీ వర్గీకరణ విషయమై ఏప్రిల్ 7న గుంటూరులో జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు బోగి శ్రీను కోరారు. ఎంఆర్‌పీఎస్ నాయకులతో కలిసి అంబేద్కర్ కూడలిలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు కట్టుబడి ఉన్న వారికి మంద కృష్ణమాదిగ మద్దతు తెలిపారని, టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిని గెలిపిస్తామన్నారు.

పోలింగ్‌లో జాగ్రత్తలు తప్పనిసరి

శృంగవరపుకోట: శృంగవరపుకోట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పోలింగ్ అధికారులు, సహాయ పోలింగ్ అధికారులకు శనివారం శిక్షణ ఇచ్చారు. సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు కిరణ్ కుమార్, ఉపతహసీల్దారు భరత్ కుమార్, కొత్తవలస డీటీ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోండి

రాజాం: ఎన్నికల సమయంలో ఏపీవోలు ఇబ్బందులు ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని రిటర్నింగ్ అధికారి ఎల్.జోషప్ సూచించారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఏపీవోలకు శిక్షణ నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ గుర్తింపు కార్డును తీసుకొస్తే పరి శీలించి వారు ఓటువేయడానికి అవకాశం కల్పించాలన్నారు. శిక్షణను మెప్మా పీడీ సుధాకర్ పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్.కృష్ణంరాజు, ఎన్నికల డీటీ ప్రకాష్ పాల్గొన్నారు.

కూటమి ప్రయోజనాలే ముఖ్యం

బొబ్బిలి: టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ప్రయోజనాలే అత్యంత ముఖ్యంగా భావిస్తూ, వాటి కోసం శ్రమిస్తున్నామని జనసేన రాష్ట్ర కార్యక్రమాల నిర్వహణా కార్యదర్శి పాలూరు బాబు అన్నారు. స్థానిక జనసైనికుల నిలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బొబ్బిలి, పార్వతీపురం, సాలూరు, కురుపాం నియోజకవర్గాల్లో జనసేన కార్యకలాపాలపై కొంతమంది చేస్తున్న దుష్ప్రచారాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కొంతమంది స్వార్థపరులు కూటమి మనుగడకు దెబ్బతగిలే విధంగా వ్యవహరిస్తున్నారని, అలాంటి శక్తులను ఉపేక్షించేది లేదన్నారు. బొబ్బిలి ఎమ్మెల్యేగా బేబీనాయన గెలుపు కోసం జనసైనికులంతా సేవలందిస్తున్నారని తెలిపారు. మండల పార్టీ అధ్యక్షుడు సంచాన గంగాధర్, రేవళ్ల కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు వేసేందుకు యువత ముందుకు రావాలి

● జాయింట్ కలెక్టర్ కార్తీక్

కలెక్టరేట్, మార్చి 30: పట్టణ ప్రాంతాల్లో ఓటు హక్కు వినియోగించుకుంటున్న వారి శాతం తక్కువగా ఉందని, దీనితో పాటు యువత కూడా ఓటు వేసేందుకు ఆసక్తి చూపడం లేదని, ఆయా వర్గాల వారు వచ్చే సాధారణ ఎన్నికల్లో పెద్ద ఎత్తున ముందుకు వచ్చి తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని జేసీ కార్తీక్ కోరారు. యువ ఓటర్లు, పట్టణ ప్రజలకు ఓటు ఆవశ్యకతపై అవగాహన కల్పించే నిమిత్తం నిర్వహించిన స్వీప్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇందులో భాగంగా శనివారం రెండు కిలోమీటర్లు పరుగు నిర్వహించారు. స్థానిక కోట జంక్షన్ నుంచి ప్రారంభమై రాజీవ్ స్టేడియం వరకూ పరుగులో ట్రైనీ సహాయ కలెక్టర్ బి.సహదిత్ వెంకట్ త్రివినాగ్, మున్సిపల్ కమిషనర్ ఎంఎం నాయుడు, హౌసింగ్ పీడీ శ్రీనివాస్, డీఎస్‌డీవో వెంకటేశ్వరరావు, నెహ్రూ యువ కేంద్రం అధికారి ఉజ్వల తదితరులు పరుగులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ మనదేశంలో యువత అధికంగా ఉన్నారని, ముఖ్యంగా కొత్తగా ఓటరుగా నమోదైన యువత ఓటు విలువ తెలుసుకుని దానిని వినియోగించుకోవడం ద్వారా దేశ ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావాలన్నారు. ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్‌లో సార్వత్రిక ఎన్నికలు ఒక పెద్ద పండుగ వంటివని, ఇందులో ప్రతి ఒక్కరూ పాల్గొనాల్సి ఉందని సూచించారు.



జెండా ఊపి ర్యాలీ ప్రారంభించిన జేసీ కార్తీక్

డ్రైవర్లకు రూ.26 వేలు జీతం ఇవ్వాలి

విజయనగరం దాసన్నపేట: ప్రజా రవాణా శాఖలో హైర్ బస్సు డ్రైవర్లకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని ఏపీ పీటీడీ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.తులసీరాం డిమాండ్ చేశారు. శనివారం హైర్ బస్సు యూనియన్ జిల్లా నాయకులు జేఎస్ఎన్ రాజు అధ్యక్షతన ఎల్‌బీజీ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 2012 నుంచి కనీస వేతన చట్టం సవరణ చేయకుండా ప్రభుత్వాలు కార్మికులను మోసం చేస్తున్నాయన్నారు. తక్షణమే కనీస వేతనాల చట్ట సవరణతో పాటు రూ.26 వేలు అమలు చేయాలని, రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రణాళికలో చేర్చాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సంఘ ప్రతినిధులు ఎ.జగన్మోహన్‌రావు, సురేష్, ధనుంజయ్, రాము, సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తులసీరామ్

కొప్పలవెలమలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలి

దాసన్నపేట, మార్చి 30: జిల్లాలోని పార్లమెంట్ పరిధిలో కొప్పలవెలమ సామాజికవర్గం అత్యధికంగా ఉన్నారని రాజకీయ ప్రాధాన్యం కల్పించాలని సంఘ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కిలపర్తి పరదేశినాయుడు, జిల్లా అధ్యక్షుడు బొత్స వరప్రసాదరావులు డిమాండ్ చేశారు. శనివారం కామాక్షినగర్‌లోని సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ అత్యధిక జనాభా ఉన్నప్పటికీ నిరాదరణకు గురవుతున్నారన్నారు. వ్యవసాయాన్ని అధారంగా చేసుకుని ఎటువంటి వివాదాస్పద కార్యక్రమాల్లో తల దూర్చకుండా కొప్పల వెలమలు ఉండటంతో రాజకీయ పార్టీలు నిరాదరణకు గురిచేస్తున్నాయన్నారు. జిల్లాలో రాజకీయ పార్టీల గెలుపు ఓటముల విషయంలో తమ ఓటు బ్యాంక్ అధార పడిఉందన్నారు. ఇప్పటికైనా రాజకీయ పార్టీలు స్పందించి పునరాలోచించాలని లేనిచో అన్యాయం చేసిన పార్టీలకు తగిన గుణపాటం చెపుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సంఘ ప్రతినిధులు తెంటు కాశీనాయుడు, దేవుడు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కొప్పలవెలమ సంఘ ప్రతినిధులు

శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే చర్యలు

రాజాం రూరల్: ఎన్నికల్లో శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే కఠినచర్యలు తప్పవని రాజాం టౌన్ సీఐ దాడి మోహనరావు హెచ్చరించారు. మునిసిపాలిటీ పరిధిలోని సారధిలో శనివారం రాత్రి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వివాదాలకు ఆస్కారం కలిగించకుండా సహకరించాలని కోరారు.



గ్రామస్థులకు సూచనలిస్తున్న సీఐ

అరాచక పాలనకు బుద్ధిచెప్పాలి



లక్ష్మీపురంలో కోండ్రు ఇంటింట ప్రచారం దృశ్యం

రేగిడి: వైసీపీ ప్రభుత్వం అసమర్ధ, అరాచక పాలనకు బుద్ధిచెప్పాలని రాజాం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కోండ్రు మురళీమోహనరావు పిలుపునిచ్చారు. మండలంలో లక్ష్మీపురం, అక్కన్నఆగ్రహారం, ఆడవరం, మజ్జిరాముని పేట, అప్పాపురంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగన్ ప్రభుత్వాన్ని గద్దెదింపాలన్నారు. కార్యక్రమంలో నాయకులు గురవాన నారాయణరావు, దూబ ధర్మారావు, కిమిడి అశోక్‌కుమార్, మజ్జి శ్రీనివాసరావు, గేదల బాలమురళీధర్, గురవాన రమేష్, కర్ణేన మహేశ్వరరావు, గురవాన ధనంజయ్‌రావు, చల్ల భుజంగరావు పాల్గొన్నారు.

రాజాం: మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతోనే బీసీల భవిష్యత్తు బాగుంటుందని టీడీపీ అభ్యర్థి కోండ్రు మురళీమోహన్ అన్నారు. శనివారం రాత్రి డోలపేటలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. అనంతరం జయహో బీసీ కార్యక్రమం నిర్వహించారు. నంది సూర్యప్రకాష్‌రావు, పొట్టా చిట్టిబాబు, టంకాల కన్నంనాయుడు, శాసపు రమేష్ కుమార్, గున్న రమేష్, గురవాన నారాయణరావు, దుప్పలపూడి శ్రీనివాసరావు, పొట్నూరు లక్ష్మణరావు, డోల రామచంద్రుడు, బీజేపీ నాయకుడు కోటగిరి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

సింహాద్రి అప్పన్న సంబరాలు



కృష్ణాపురంలో సంబరాలు చేస్తున్న గ్రామస్థులు

బొబ్బిలి: కృష్ణాపురం గ్రామంలో శనివారం సాయంత్రం గ్రామస్థుల ఇలవేల్పు శ్రీసింహాద్రి అప్పన్న సంబరాలను ఘనంగా నిర్వహించారు. ప్రతి 12 ఏళ్లకోసారి సింహాద్రి అప్పన్న సంబరాలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. స్వామి వారికి భక్తిశ్రద్ధలతో మొక్కులు సమర్పించుకున్నారు. కోలాటం, తప్పెటగుళ్ల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

టీడీపీతోనే అభివృద్ధి సాధ్యం



చింతలపాలెంలో వృద్ధురాలికి సూపర్‌సిక్స్ పథకాలు వివరిస్తున్న కోళ్ల

లక్కవరపుకోట (కొత్తవలస), మార్చి 30: టీడీపీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యమవుతుందని శృంగవరపుకోట నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కోళ్ల లలితకుమారి అన్నారు. గెలుపే ధ్యేయంగా ప్రచారం చేస్తున్న ఆమె రోజుకు నాలుగు గ్రామాల చొప్పున తిరుగుతూ ప్రజలను కలుస్తున్నారు. ఈ క్రమంలో శనివారం ఉదయం మండలంలోని చింతలపాలెం గ్రామంలో ప్రచారం చేపట్టారు. టీడీపీ-జనసేన, బీజేపీ కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ వెళ్లి వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. సాయంత్రం అర్జునాపాలెం, పాత సుంకరపాలెం, యర్రవానిపాలెం గ్రామాల్లో పర్యటించారు. ప్రజా సంక్షేమం కోసం చంద్రబాబు ప్రవేశపెట్టిన సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు. చంద్రబాబు గెలుపు రాష్ట్ర ప్రజలకు అవసరమన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రజల అభిప్రాయం గౌరవిస్తా

శృంగవరపుకోట: ప్రజల అభిప్రాయాన్ని గౌరవిస్తానని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ అన్నారు. శనివారం శృంగవరపుకోటలో తన వర్గీయులతో సమావేశమయ్యారు. హైదరాబాద్‌లో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను కలిశామన్నారు. రెండేళ్లుగా నియోజకవర్గంలో జరుగుతున్న పరిణామాలు, పరిస్థితులను వివరించానని చెప్పారు. పార్టీ ఓ నిర్ణయం తీసుకున్నందున సపోర్టు చేయాలని లోకేష్ సూచించారన్నారు. కార్యకర్తలు, ప్రజలు కోరితే ఇండిపెండెంట్‌గా నిలబడేందుకు సిద్ధంగా ఉన్నానని తెల్పి చెప్పారు. కేడర్ అభిప్రాయాలు తెలుసుకోనేందుకు ఆదివారం సాయంత్రం స్థానికంగా బహిరంగ సభను ఏర్పాటు చేస్తున్నానన్నారు. విశాఖ పార్లమెంటు టీడీపీ ఉపాధ్యక్షుడు రాయవరపు చంద్రశేఖర్, కొత్తవలస మండల టీడీపీ అధ్యక్షుడు గోరపల్లి రాము, నాయకులు జుత్తాడ రామసత్యం, పైడిబాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గొంప కృష్ణ

దుర్మార్గపు పాలనకు అంతం తప్పదు



ఎన్నికల ప్రచారంలో అభిమానులు అందించిన ఖడ్గంతో బేబీనాయన

బొబ్బిలి: రాష్ట్రాన్ని తీవ్రమైన ఆందోళనకర స్థితిలోకి నెట్టేసిన వైసీపీ దుర్మార్గపు పాలన అంతమొందడం ఖాయమని టీడీపీ-జనసేన-బీజేపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి ఆర్‌వీఎస్‌కేకే రంగారావు (బేబీనాయన) అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన పట్టణంలోని నాలుగో వార్డులో ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలుసుకున్నారు. చంద్రబాబు హయాంలో మంచి పరిపాలన వచ్చేందుకు అందరూ ఎన్‌డీఏ కూటమికి ఓట్లు వేయాలని అర్థించారు. దావాల వీధిలో పలువురు అభిమానులు బేబీనాయనకు నాగలిని, ఖడ్గాన్ని బహుమతిగా అందజేశారు. ఆయన వెంట బీజేపీ, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జిలు మరిశర్ల రామారావునాయుడు, గిరడ అప్పలస్వామి, పెద్దింటి మనోజ్ కుమార్, లంక రమేష్, టీడీపీ నేతలు రాంబార్కి శరత్‌బాబు, రౌతు రామ్మూర్తి, పువ్వల శ్రీనివాసరావు, గెంబలి శ్రీనివాసరావు, వాసిరెడ్డి సత్యనారాయణ, సుంకరి సాయిరమేష్ తదితరులు పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వ హయాంలో తమకు మేలు జరిగేలా చూడాలని కోరుతూ బేబీనాయనకు జిల్లా తెలగ సంక్షేమ సంఘ అధ్యక్షుడు చనుమల్లు ప్రసాదరావు వినతిపత్రం అందజేశారు.

వృద్ధులకు ఇంటి వద్దనే ఓటింగ్

వంగర: గ్రామాల్లోని కురువృద్ధులు(84 ఏళ్లపై బడినవారికి) ఇంటివద్దనే ఓటువేసుకునే విధంగా ఎన్నికల సంఘం అవకాశం కల్పించిందని ఎంఈవో దుర్గారావు తెలిపారు. శనివారం ఆయన కింజంగి, మరువాడ, కోనంగిపాడులో ఇంటింటికి వెళ్లి వృద్ధుల వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దివ్యాంగులకు సైతం ఎన్నికల సంఘం వెసులుబాటు కల్పించినట్లు తెలిపారు.

ఫుట్‌పాత్‌ల ఆక్రమణ

● కాల్వలపై నిర్మాణాలు
● పేరుకుపోతున్న చెత్త నిల్వలు
● చోద్యం చూస్తున్న మున్సిపల్ యంత్రాంగం

రాజాం రూరల్: రాజాం మున్సిపాలిటీలో ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలు వెలిశాయి. కాల్వలపై నిర్మాణాలు పెరిగాయి. ఫలితంగా పారిశుధ్య సిబ్బంది కాల్వలు పరిశుభ్రం చేయలేని పరిస్థితి. దీంతో కాల్వలు వ్యర్థాలతో నిండిపోయి దోమల సంతతి పెరిగిపోతోంది. మురుగునీరు రోడ్డుపైకి చేరుతోంది. చిన్నపాటి వర్షం కురిసినా పరిస్థితి భయానకంగా మారుతోంది. అయినాసరే మున్సిపల్ యంత్రాంగానికి దోమ కుట్టినట్లయినా లేదు. రాజాం మెయిన్‌రోడ్డు విస్తరణ సమయంలో కాల్వలపై పలకలు వేసేందుకు వేలాది రూపాయలు ఖర్చు చేశారు. పాదచారుల రాకపోకలకు వీలుగా ఏర్పాటు చేసినా పట్టణ పరిధిలో ఎక్కడా అవి కనిపించడం లేదు. కాల్వలను కప్పేసి నిర్మాణాలు చేపట్టారు. కొందరు బతుకు తెరువు కోసం, మరికొందరు ఆక్రమించి షాపులు అద్దెకిస్తూ నాలుగు రాళ్లు సంపాదిస్తున్నారు. మెయిన్ రోడ్డుకు ఇరువైపులా ఇదే పరిస్థితి. మాధవ బజార్, శ్రీనివాసా రోడ్, బజార్ రోడ్ తదితర ప్రాంతాలలో కాల్వలను వ్యాపారులు ఆక్రమించి తమకు అనుకూలంగా నిర్మాణాలు చేపట్టారు. మున్సిపల్ యంత్రాంగం వీటి జోలికి పోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.





మాధవబజార్‌లో కాల్వలను ఆక్రమించి చేసిన నిర్మాణాలు, అంబేద్కర్ కూడలిలో ఫుట్‌పాత్‌పై నిర్మాణాలు

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



ఈశ్వరరావు (ఫైల్)

దత్తిరాజేరు, మార్చి 30: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించి పెదమానాపురం ఎస్ ఐ శిరీష తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని చుక్కపేటకు చెందిన కొనిసి ఈశ్వరరావు(33) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం మెంటాడ మండలం కుంటినవలస గ్రామంలోని బంధువుల ఇంటికి ద్విచక్రవాహనంపై వెళ్లాడు. అక్కడి నుంచి తిరిగి స్వగ్రామమైన చుక్కపేటకు శనివారం వేకువజామున ద్విచక్రవాహనంపై బయలుదేరి వస్తుండగా కోమటిపల్లి చెరువు దగ్గర జాతీయ రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో ఈశ్వరరావు అక్కడికక్కడే మృతిచెందాడు. ఘటనా స్థలాన్ని ఎస్ఐ పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజపతినగరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. కాగా మృతుడుకి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

గంజాయి కేసులో ఇద్దరికి శిక్ష

విజయనగరం క్రైమ్, మార్చి 30: జిల్లా కేంద్రంలోని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్లో 2023లో నమోదైన గంజాయి కేసులో ఇద్దరు నిందితులకు ఏడాది చొప్పున జైలు శిక్షతో పాటు రూ.వెయ్యి జరిమానా విధించారు. దీనికి సంబంధించి వన్ టౌన్ సీఐ వెంకట్రావు శనివారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. విజయనగరం రైల్వేస్టేషన్ సమీపంలో 2023 ఫిబ్రవరి 2న ఇద్దరు వ్యక్తులు గంజాయి ప్యాకెట్లు కలిగి ఉండి అమ్మకానికి ప్రయత్నిస్తున్నారని వన్‌టౌన్ పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో వన్‌టౌన్ పోలీసులు రైల్వేస్టేషన్ వద్దకు చేరుకుని భర్తకాన శేఖర్, షేక్ ఖరేషిలను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రెండు వందల గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితునిపై అప్పటి ఎస్సై అశోక్‌కుమార్ కేసు నమోదు చేశారు. సీఐ వెంకట్రావు దర్యాప్తు చేసి నిందితులను అరెస్టు చేసి కోర్టులో అభియోగపత్రాన్ని దాఖలు చేశారు. నేరారోపణలు రుజువు కావటంతో ఏడాది జైలు శిక్షతో పాటు వెయ్యి జరిమానా విధిస్తూ అడిషనల్ జుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ బి.రమ్య తీర్పునిచ్చారు.

మద్యం సీసాలతో పట్టుబడ్డ మహిళ

బొబ్బిలి: మండలంలోని కారాడ గ్రామానికి చెందిన ఈదుబిల్లి పార్వతి 60 క్వార్టర్ బాటిల్స్, 6 ఫుల్ మద్యం బాటిళ్లతో శనివారం పట్టుబడినట్లు ఎస్‌ఈబీ సీఐ బీవీ మురళీధర్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు ఆమె ఇంట్లో తనిఖీలు నిర్వహించగా మద్యసీసాలను గుర్తించామని, దీంతో ఆమెను అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించామన్నారు. ఈ దాడుల్లో ఎస్ఐలు ఎస్వీ రామారావు, ఎల్.తిరుపతిరావు, హెచ్‌సీ బి.మాధవిదేవి, ఈసీలు బి.ఆదినారాయణ, వై.సరస్వతి పాల్గొనట్లు సీఐ తెలిపారు.

మొబైల్ యాప్స్ గుర్తించడంలో ప్రతిభ

● నోబుల్ వరల్డ్ రికార్డు సొంతం చేసుకున్న చిన్నారి

దాసన్నపేట, మార్చి 30: మొబైల్ ఫోన్‌లో యాప్‌లను గుర్తించి, వాటిని ఆపరేట్ చేస్తున్న రెండేళ్ల బాలుడు నోబుల్ వరల్డ్ రికార్డుకు ఎంపికయ్యాడు. రైల్వేలో ట్రైన్ మేనేజర్‌గా విధులు నిర్వర్తిస్తున్న బగ్గు జగదీష్, బగ్గు యాషికా రమ్య దంపతుల కుమారుడైన రెండేళ్ల కనిష్క్ కృష్ణ చిన్న వయసులోనే స్మార్ట్ మొబైల్ ఫోన్స్‌లో సుమారు 30 నుంచి 40 యాప్స్ గురించి అడిగిన వెంటనే గుర్తించి తెలియజేస్తున్నాడు. వాటిని ఓపెన్ చేస్తున్నాడు. ఈ పరిజ్ఞానాన్ని గుర్తించిన తల్లిదండ్రులు నోబుల్ వరల్డ్ రికార్డుకు దరఖాస్తు చేశారు. వెంటనే వారు పరిగణలోకి తీసుకుని బాలుడి ప్రతిభను గుర్తించి అవార్డుకు ఎంపిక చేశారు. ఈ అవార్డును శ్రీకాకుళం ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు చేతుల మీదుగా శనివారం చిన్నారికి అందించారు. చిన్నారి ప్రతిభను గుర్తించిన ఎంపీ తల్లిదండ్రులతో పాటు బాలుడిని అభినందించారు. ఎంపీని కలిసిన వారిలో కింజరాపు వెంకటరమణ తదితరులున్నారు.



ఎంపీ రామ్మోహన్‌నాయుడు చేతుల మీదుగా నోబుల్ వరల్డ్ రికార్డు అందుకుంటున్న బాలుడు కనిష్క్ కృష్ణ

అందరూ కలిసికట్టుగా ఉండాలి

రాజాం: అందరూ కలిసికట్టుగా ఉండి ఎన్నికలు నిర్వహించుకోవాలని, ఎటువంటి తగాదాలు పడినా కోర్టుల చుట్టూ తిరగవలసి వస్తుందని రూరల్ సీఐ ఎస్.శ్రీనివాసరావు అన్నారు. శనివారం రాత్రి సంతకవిటి మండలం వాల్తేరు గ్రామంలో ప్రజలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికలు సజావుగా నిర్వహించుకుంటే ఇబ్బందులు ఉండవన్నారు. పోలీసు సిబ్బంది, గ్రామపెద్దలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రూరల్ సీఐ

కాలువ ఇప్పుడు గుర్తుకొచ్చింది



నగరంలోని అయ్యన్న కోనేరు గట్టు నుంచి దాసన్నపేట మెయిన్ రోడ్డుకి వెళ్లే రహదారికి ఒక వైపు కాలువ నిర్మాణ పనులు కోడ్ వచ్చిన తరువాత ప్రారంభమయ్యాయి. ఎప్పటి నుంచో ఆ కాలువ పనులు పెండింగ్‌లో ఉన్నా పాలకులు ... అధికారులు పట్టించుకోలేదు. నాలుగైదు రోజులుగా కాలువ నిర్మాణ పనులు ఊపందుకున్నాయి. ఈ విషయమై నగర పాలక సంస్థ కమిషనర్ మల్లయ్యనాయుడును అడగ్గా.. గతంలోనే ఈ పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు. హడావిడిగా ప్రారంభం కావడం... నాణ్యత లేకపోవడాన్ని చూసి ప్రజలు విస్తుపోతున్నారు.

-విజయనగరం రింగురోడ్డు

ఎన్నికల కమిషన్ ఆదేశాలు పాటించాలి

● కలెక్టర్ నాగలక్ష్మి
● సిబ్బందికి శిక్షణా కార్యక్రమాలు

గజపతినగరం: గత ఎన్నికలతో పోలిస్తే ఈ దఫా ఎన్నికల నిబంధనలు మారాయని, వాటిని దృష్టిలో ఉంచుకుని ఎన్నికల కమిషన్ ఆదేశాలను తప్పకుండా పాటించాలని కలెక్టర్ నాగలక్ష్మి అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో నియోజకవర్గ స్థాయిలో జరిగే పీవోల శిక్షణా తరగతులను ఆమె పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పీవోలకు అందరి విధులపై అవగాహన కలిగిఉండాలన్నారు. రీపోలింగ్‌కు ఎక్కడా అవకాశం ఇవ్వకూడదని ఎట్టి పరిస్థితుల్లోను తప్పులు, పొరపాట్లు జరగకూడదని స్పష్టం చేశారు. ఏమాత్రం విధుల్లో పొరపాట్లు జరిగినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పోలింగ్ రోజున ఉదయం నుంచే వీలైనంత వేగంగా పోలింగ్ ప్రక్రియ జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఒక ఓటరు పోలింగ్ కేంద్రంలోకి వెళ్లి ఓటు వేయడానికి 7 నిమిషాలు పడుతుందని దానిని దృష్టిలో ఉంచుకుని ఇతర పనులు పూర్తి చేయాలన్నారు. ప్రతి చోటా పోలింగ్‌కు 90 నిమిషాల ముందే తప్పనిసరిగా మాక్‌పోల్ నిర్వహించాలని అనంతరం ఈవీఎంలను డిలీట్ చేయాలని వీవీ ప్యాట్లు ఖాళీ చేసి సీల్ చేయాలని సూచించారు. ప్రతి చోటా మాక్ పోల్ తప్పనిసరి అని అది జరగకపోతే పోలింగ్ రద్దయ్యే అవకాశం ఉందన్నారు. ఉదయం 5-45 గంటలకు మాక్ పోలింగ్ పూర్తి కావాలని ప్రతి పోలింగ్ కేంద్రానికి పీవోతో పాటు నలుగురు సిబ్బందిని కేటాయిస్తామని చెప్పారు. ఎన్నికల విధులకు ప్రభుత్వ శాశ్వత ఉద్యోగులను మాత్రమే నియమిస్తారని, వలంటీర్లు, అవుట్‌సోర్స్, కాంట్రాక్టు ఉద్యోగులకు అవకాశం లేదన్నారు. ఎన్నికల శిక్షణ మూడు విడతల్లో నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం ఎన్నికల ప్రక్రియ, ఈవీఎంల పనితీరు, పీవోలు, ఏపీవోల విధులు,


గజపతినగరం: అధికారులకు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌తో అవగాహన కల్పిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

బాధ్యతలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ సహదిత్ వెంకట త్రివినాగ్ ఆర్డీవో ఎంవీ సూర్యకళ, తహసీల్దార్ సీహెచ్ రమేష్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మాక్ పోలింగ్ తప్పనిసరి

బొబ్బిలి: బొబ్బిలి ప్రభుత్వ గురుకుల పాఠశాలలో పోలింగ్ అధికారుల శిక్షణ శిబిరాన్ని కలెక్టర్ నాగలక్ష్మి శనివారం సందర్శించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ తొలుత మాక్ పోలింగ్ నిర్వహించాలని స్పష్టం చేశారు. మాక్‌పోలింగ్ నిర్వహించకపోతే పోలింగ్ రద్దయ్యే అవకాశం ఉందని చెప్పారు. పోలింగ్ ఆరంభం, ముగింపు వేళలను సక్రమంగా పాటించాలని, నిర్ణీత సమయానికి క్యూలైన్‌లో ఉన్న వారందరికీ ఓటు హక్కు వినియోగించుకునేలా అవకాశం ఇవ్వాలన్నారు. వలంటీర్లను ఎన్నికల్లో వినియోగించుకోరాదన్నారు. ఎక్కడా రీపోలింగ్ లేకుండా పక్కాగా ప్రక్రియను పూర్తి చేయాలని ఆమె ఆదేశించారు. ఏజెంట్లుగా వలంటీర్లు, ప్రభుత్వ ఉద్యోగులు ఉండకూడదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో ఆదిమూలం సాయిశ్రీ, తహసీల్దార్‌లు త్రినాథరావునాయుడు, రాజారావు, డిప్యూటీ తహసీల్దార్‌లు రెడ్డి సాయికృష్ణ, మాస్టర్ ట్రైనీలు పాల్గొన్నారు.

● **నెల్లిమర్ల:** స్థానిక సీకేఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్నికల సిబ్బందికి శనివారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం.నూకరాజు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.


శిక్షణ నిర్వహిస్తున్న దృశ్యం

సుమారు 450 మంది ప్రిసైడింగ్ అధికారులకు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు ఈ శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ధర్మరాజు, హెచ్‌డీటీ డి.శైలజ, ఎన్నికల విభాగం డీటీ మూర్తి, డెంకాడ, భోగాపురం, పూసపాటిరేగ మండలాల తహసీల్దార్లు, డీటీ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. ఎనిమిది మంది రిసోర్స్ పర్సన్లు శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నారు.

సీటు వదులుకోవడానికి సిద్ధంగా లేను

● టీడీపీ నాయకుడు నాగార్జున

చీపురుపల్లి: పార్టీ తీసుకున్న నిర్ణయం విస్మయాన్ని, బాధను కలిగించిందని టీడీపీ నాయకుడు కిమిడి నాగార్జున అన్నారు. చీపురుపల్లి అసెంబ్లీ సీటును టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు కిమిడి కళావెంకటరావుకు కేటాయించిన నేపథ్యంలో ఆయన శనివారం చీపురుపల్లిలోని తన నివాసంలో నాయకులు, కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ తమ పెదనాన్న పదవుల కోసం తన తండ్రి గణపతిరావు, తల్లి మృణాళిని రెండు సార్లు త్యాగం చేశారన్నారు. ఇకపై త్యాగం చేయడానికి తాను, తన కుటుంబం సిద్ధంగా లేదని స్పష్టంచేశారు. రెండు రోజుల్లో తన తుది నిర్ణయాన్ని ప్రకటిస్తానని చెప్పారు. సమావేశంలో నాగార్జున కంట తడి పెట్టుకున్నారు. 2019 ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత కార్యకర్తలు చూపించిన ప్రేమ, అభిమానాలు తనను ఇక్కడ కట్టి పడేశాయన్నారు. కుటుంబానికి దూరంగా చీపురుపల్లిలో స్థిర నివాసం ఏర్పాటు చేసుకుని ఒంటరిగా ఉన్నానని చెప్పారు. రౌతు కామునాయుడు, దన్నాన రామచంద్రుడు, తాడ్డి సన్యాసినాయుడు, పైల బలరాం తదితర నాయకులు మాట్లాడుతూ నాగార్జున టికెట్ విషయంలో పార్టీ నాయకులు పునఃపరిశీలించాలని విజ్ఞప్తి చేశారు.


మాట్లాడుతున్న నాగార్జున

పందుల నిర్మూలనకు చర్యలేవీ?

● ఇబ్బందులు పడుతున్న గజపతినగరం, పురిటిపెంట గ్రామస్థులు

గజపతినగరం: గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలని అధికారులు చెబుతున్నప్పటికీ పందుల నిర్మూలనకు మాత్రం ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం శోచనీయమని గజపతినగరం, పురిటిపెంట గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రెండు గ్రామాల్లో పందుల సంచారం అధికంగా ఉంది. దీంతో ఎటువంటి వ్యాధుల బారిన పడాల్సి వస్తుందోనని ఆయా గ్రామస్థులు భయాందోళన చెందుతున్నారు. రెండు పంచాయతీల అధికారులకు, ప్రజాప్రతినిధులకు తమ గోడు వెళ్లబుచ్చినా ఏఒక్కరూ పట్టించుకోవడం లేదని వారు వాపోతున్నారు. పందుల సంచారంతో డెంగ్యూ, చికెన్‌గునియా, మలేరియా, స్వైన్‌ఫ్లూ తదితర వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని రెండు పంచాయతీల ప్రజలు కోరుతున్నారు.


గజపతినగరంలో సంచరిస్తున్న పందులు

అవగాహన లేకపోతే ఎలా బోధిస్తారు?

● ఎఫ్-4 పరీక్షలపై వివరాలను ఇవ్వలేకపోయిన సిబ్బంది
● అధికారులపై విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ ఆగ్రహం

గుమ్మలక్ష్మీపురం: డిజిటల్ విద్య బోధనపై ఉన్నత స్థాయి అధికారులకే అవగాహన లేకపోతే విద్యార్థులకు ఏ విధంగా పాఠ్యాంశాలను బోధించగలరని రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వచ్చే నెల నుంచి జరగనున్న ఎఫ్ఏ-4 పరీక్షలు ఎప్పుడు జరుగుతున్న ప్రశ్నకు కూడా సమాధానం ఇవ్వకపోవడంతో మండిపడ్డారు. శనివారం గుమ్మలక్ష్మీపురం జడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించారు. తొలుత తొమ్మిదో తరగతిలోకి వెళ్లి బోధనపై ఆరా తీశారు. ఈ సందర్భంగా బైజూస్, డిజిటల్ క్లాస్ రూమ్‌లు ఏ విధంగా బోధిస్తారో చూపించాలని డీఈవో పగడాలమ్మకు డిప్యూటీ డీఈవోలు, హెచ్ఎం బిడ్డిక భీముడు సూచించారు. దీంతో వారు డిజిటల్ బోర్డు వద్ద వివరించలేకపోయారు. డైట్ ప్రిన్సిపాల్‌గా పనిచేసిన మీకే బోధనపై కనీస అవగాహన లేకపోతే ఎలా అని ప్రశ్నించారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా రూ.మూడు వేలు కోట్లతో డిజిటల్ తరగతులు నిర్వహణకు ప్రాధాన్యత ఇస్తే వాటిపై కనీస అవగాహన లేకపోవడం విచారకరమని తెలిపారు. ఇక్కడ పది మంది ఉపాధ్యాయులు మాత్రమే ఉండాల్సి ఉండగా 16 మంది ఉన్నా విద్యాబోధన పట్ల ఇంత నిర్లక్ష్యం వహించడంతగదన్నారు. అనంతరం ఎస్కే పాడులో ప్రాథమికపాఠశాలలో నాలుగు,ఐదో తరగతివిద్యార్థుల వర్క్‌బుక్స్‌ను పరిశీలించారు. విద్యార్థులు లెక్కలు వర్క్‌బుక్‌లో చేయక పోవడం, లెక్కలు చెప్పకపోవడంపై ఉపాధ్యాయులు,హెచ్ఎంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. పర్యవేక్షణలోపంపై ఎంఈవోను హెచ్చరించారు. అనంతరం ఓంద్రు బంగి పాఠశాలకు రహదారి లేకపోవడంపై మోటార్ సైకిల్‌పైవెళ్లారు. ఇక్కడ సకాలంలో పుస్తకాలు కూడా పంపిణీ కాక పోవడాన్ని గుర్తించారు. విద్యా ప్రమాణాలు సరిగా లేకపోవడంపై ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. కొత్తగూడ ఆశ్రమ పాఠశాలలో ట్యాబ్‌లు వినియోగించక పోవడంతో ఉపాధ్యాయులపై ఆగ్రహంవ్యక్తం చేశారు. ఏజెన్సీలో విద్యా ప్రమాణాలు అధ్వానంగా ఉండడంపై అసహనాన్ని వ్యక్తం చేశారు.ఆయన వెంట ఐటీడీఏ పీవోవిష్ణుచరణ్ ఉన్నారు.కాగా ఎంఈవో-1లు వృత్తిపరంగా ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ప్రవీణ్ ప్రకాష్‌కు ఎంఈవో-1 అసోసియేషన్ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం వినతిపత్రం అందజేశారు.


అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేస్తున్న ప్రవీణ్ ప్రకాష్

ఎంఈవోలు అప్రమత్తంగా ఉండాలి

గరుగుబిల్లి: రాష్ట్ర విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ మండలాల్లో పర్యటించే సమయంలో ఎంఈవోలు అప్రమత్తంగా ఉండాలని విద్యాశాఖ రీజినల్ డైరెక్టర్ తెలిపారు. శనివారం ఎంఈవోలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. విద్యార్థులు యూనిఫాంలోనే పాఠశాలలకు హాజరయ్యేలా చూడాలని, ఎన్నికల కోడ్ దృష్ట్యా జగన్ పేరు ఉన్న బెల్టును ధరించకుండా చూడాలని, శనగ చక్కీలను ఇచ్చేటప్పుడు ప్యాకెట్‌పై ఉన్న జగన్ చిత్రం తొలగించాలని సూచించారు.

ప్రజల ఆశీస్సులే శ్రీరామరక్ష

● కూటమి సాలూరు అభ్యర్థి సంధ్యారాణి


ప్రచారం చేస్తున్న సంధ్యారాణి

మెంటాడ: ఈ ఎన్నికల్లో ప్రజల ఆదరాభిమానాలే తన విజయానికి శ్రీరామరక్ష అని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి సాలూరు అభ్యర్థి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. మండలంలోని బుచ్చిరాజుపేట, గురమ్మవలస గ్రామాల్లో ఆమె శనివారం పర్యటించారు. బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించి, సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు. కూటమి ప్రభంజనంతో వైసీపీలో వణుకు మొదలైందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు చలుమూరి వెంకటరావు, పార్టీ శ్రేణులు జి.అన్నవరం, ముసలినాయుడు, తాడ్డి తిరుపతి, రెడ్డి ఎర్నాయుడు, ఆదినారాయణ, అనీల్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలపై అవగాహన

బొండపల్లి: సార్వత్రిక ఎన్నికల నిబంధనలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ కె.లక్ష్మణరావు అన్నారు. ఈ మేరకు శనివారం నెలివాడ గ్రామంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.


అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ లక్ష్మణరావు

ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుమతులు లేకుండా గ్రామాల్లో ఎక్కడా ర్యాలీలు నిర్వహించకూడదని చెప్పారు. పార్టీలకు చెందిన బ్యానర్లు, ఫ్లెక్సీలను ఎన్నికల అధికారుల అనుమతి తీసుకున్న తర్వాతే ఏర్పాటు చేయాలన్నారు. మద్యం, డబ్బులు పంపిణీ వంటి కార్యక్రమాలు చేపడితే చర్యలు తీసుకోకతప్పదని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది బంగారునాయుడు తదితరులు పాల్గొన్నారు.

గోతిలో చిక్కుకున్న హైనా

నెల్లిమర్ల: బొప్పడాం పంచాయతీ పినతరిమి జంక్షన్‌లో ఓ గోతిలో పడి చిక్కుకుని ఉన్న ఓ అడవి జంతువును స్థానికులు శనివారం ఉదయం గుర్తించారు. విషయాన్ని అటవీ శాఖ అధికారులకు తెలియజేయడంతో అటవీ అధికారులు ఆ స్థలానికి చేరుకుని, ఆ జంతువును గోతిలో నుంచి బయటకు తీసి, ప్రత్యేక వాహనంలో విశాఖ జూకు తరలించారు. ఆ జంతువును హైనాగా గుర్తించారు. శుక్రవారం అర్ధరాత్రి సమయంలో తాగునీటి కోసం సంచరిస్తూ ప్రమాదవశాత్తు గోతిలో పడి బయటకు రాలేక ఉండిపోయినట్టు భావిస్తున్నారు. ఈ జంతువును చూసేందుకు స్థానికులు అధిక సంఖ్యలో అక్కడకు చేరుకున్నారు. జంతువు తరలింపు కార్యక్రమంలో డీఆర్వో కేవీఎస్ రాజు, ఫారెస్టు బీట్ అధికారి రామారావు తదితరులు పాల్గొన్నారు.


గోతిలో పడి చిక్కుకున్న హైనా

రస్తా ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న శ్రీరామ్‌నగర్ కాలనీవాసులు

నెల్లిమర్ల: నగర పంచాయతీ పరిధిలోని శ్రీరామ్‌నగర్ ప్రాంతంలో సర్వే నెం.311/1, 2ల్లో ఉన్న ప్రభుత్వ భూమి, రస్తాను ఆక్రమించిన వైసీపీ నాయకుడిపై తక్షణమే చర్యలు చేపట్టాలని ఆ ప్రాంత వాసులు తహసీల్దార్ ధర్మరాజుకు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా శ్రీరామ్‌నగర్ కాలనీ, అలబాన వీధి వాసులు మాట్లాడుతూ రస్తా ఆక్రమణ వల్ల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెప్పారు. తక్షణమే రెవెన్యూ అధికారులు రికార్డుల ప్రకారం ప్రభుత్వ భూమిని గుర్తించాలని వారు కోరారు.

అక్రమ కట్టడాలపై చర్యలు చేపట్టండి

నెల్లిమర్ల నగర పంచాయతీ పరిధిలోని మొయిద జంక్షన్‌తో పాటు పలు ప్రాంతాల్లో ఎలాంటి అనుమతులు లేకుండా చేపడుతున్న అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరక్టర్ జనా ప్రసాద్, కౌన్సిలర్లు మైపాడ ప్రసాద్, మొయిద శ్రీనివాసరావు, పాండ్రంకి సత్యవతి తదితరులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు శనివారం స్థానిక నగర కమిషనర్ పి.బాలాజీ ప్రసాద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. తక్షణమే కట్టడాలను ఆపేందుకు చర్యలు చేపట్టకపోతే జిల్లా అధికారుల దృష్టికి తీసుకువెళ్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో గంటా సతీష్, పైల మురళి తదితరులు పాల్గొన్నారు.

జీవితంలో విద్యార్థి దశే కీలకం

నెల్లిమర్ల: విద్యార్థి దశలో ప్రతిఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని బొండపల్లి ఎస్ఐ కె.లక్ష్మణరావు సూచించారు. సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో శనివారం నిర్వహించిన ఫ్రెషర్స్‌డే వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై, మాట్లాడారు. ఉద్యోగాలు సాధించే సమయంలో పోలీసు విచారణలో కేసులు నమోదైనట్టు గుర్తిస్తే ఇబ్బందులు ఎదురుకాక తప్పవన్నారు. లోన్ యాప్, సైబర్ మోసాలకు గురికాకుండా చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల ప్రవర్తనపై రిజిస్ట్రార్ డా.పి.పల్లవి, డిప్యూటీ రిజిస్ట్రార్ డా.ఆర్ఎస్ వర్మ వివరించారు. అకడమిక్ డీన్ డా.సన్నీడియోల్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా కోదండ రామాలయ ప్రారంభోత్సవాలు

నెల్లిమర్ల: కొత్తపేట గ్రామంలో నూతనంగా నిర్మించిన కోదండ రామాలయ ప్రతిష్ఠా మహోత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 8 గంటల నుంచి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


శిఖర ప్రతిష్ఠ నిర్వహిస్తున్న దృశ్యం

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

మెంటాడ: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని అమ్మ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు చొక్కాకు సన్యాసినాయుడు అన్నారు. జీటీపేట గ్రామంలో తన తల్లిపేరున ఏర్పాటుచేసిన రామయ్యమ్మ గ్రంథాలయాన్ని ఆయన శనివారం ప్రారంభించారు. పాఠకులకు అన్నిరకాల పుస్తకాలను అందుబాటులో ఉంచుతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్ఐ పి.కృష్ణమూర్తినాయుడు, విశ్రాంత ఉపాధ్యాయుడు పి.నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

స్పందించారు.. సరిచేశారు

మక్కువ: మండలంలోని కాశీపట్నం గ్రామంలో ప్రధాన రహదారి పక్కన ఒరిగిపోయి ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని సంబంధిత అధికారులు శనివారం సరిచేశారు. ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన విద్యుత్ స్తంభానికి క్రేన్ దన్ను కథనంపై విద్యుత్ శాఖాధికారులు స్పందించారు. వాలిపోయిన స్తంభాన్ని నిల్పోబెట్టారు. దీంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


సరిచేసిన విద్యుత్ స్తంభం

క్లుప్తంగా..

అంగన్‌వాడీ కేంద్రాలకు ఒంటి పూట అమలు చేయాలి

పాచిపెంట: ఎండల తీవ్రత దృష్ట్యా అంగన్‌వాడీ కేంద్రాలకు కూడా ఒంటి పూట అమలు చేయాలని స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు యూనియన్ కార్యదర్శి కె.పార్వతీదేవి డిమాండ్ చేశారు. మండలంలోని కోడికాళ్లవలస గ్రామంలో శనివారం ఆమె అంగన్‌వాడీ కార్యకర్తలతో సమావేశమయ్యారు. సమ్మె సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన జీవోలు అమలు చేసి అంగన్‌వాడీ ఉద్యోగులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఐసీడీఎస్ బలోపేతానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు. మినీ అంగన్‌వాడీ ఉద్యోగులను మెయిన్ అంగన్‌వాడీలుగా మార్చాలని కోరారు. ఈ సమావేశంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అన్నప్రసాద నిర్వాహక కమిటీ ఏర్పాటు


అన్నదానాన్ని ప్రారంభిస్తున్న నూతన నిర్వాహక కమిటీ సభ్యులు

గరుగుబిల్లి: చినతిరుపతిగా ప్రసిద్ధిగాంచిన తోటపల్లి వేంకటేశ్వర, కోదండరామస్వామి దేవస్థానం అన్నప్రసాద నిర్వాహక కమిటీని శనివారం ఏర్పాటు చేశారు. చైర్మన్‌గా మోనంగి ప్రకాష్, వైస్ చైర్మన్‌గా గ్రామీణ వికాస్ బ్యాంకు మేనేజర్ గంటా శ్రీనివాసరావు, కార్యదర్శిగా గెంబలి శ్రీరామచంద్ర మూర్తి, కోశాధికారిగా మార్కొండ పకీరునాయుడును ఎన్నుకున్నారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో చైర్మన్ ఎం.సత్యనారాయణ, మేనేజింగ్ ట్రస్టీ డి.ధనుంజయరావు, ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ డాక్టర్ డి.పారినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కును దుర్వినియోగం చేయొద్దు

జియ్యమ్మవలస: ఓటు అనే వజ్రాయుధాన్ని దుర్వినియోగం చేయకుండా, స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకోవాలని చినమేరంగి పోలీస్‌స్టేషన్ ఎస్ఐ ఇ.చిన్నంనాయుడు ప్రజలను కోరారు. శనివారం ఆయన ఆధ్వర్యంలో చింతలబెలగాం, పరజపాడు, లక్ష్మీపురం గ్రామాల్లో కేంద్ర బలగాలు, సివిల్ పోలీసులు ఆరు కిలో మీటర్లు దూరం కవాతు నిర్వహించారు.


పరజపాడులో కవాతు చేస్తున్న పోలీసులు

పార్వతీపురంలో 'రన్ ఫర్ జీసస్'

పార్వతీపురం టౌన్: ఏసు మరణం సర్వమానవాళి రక్షణ కోసమేనని విశాఖ సెనెడ్ బిషప్ సుదర్శన్ అన్నారు. శనివారం ఈస్టర్ పర్వదిన ఉత్సవాల్లో భాగంగా పట్టణ పాస్టర్స్ యువజన విభాగం ఆధ్వర్యంలో రన్ ఫర్ జీసస్ కార్యక్రమం నిర్వహించారు. అలాగే ఆర్టీసీ కాంప్లెక్స్, నాలుగు రోడ్ల కూడలి, పాతబస్టాండ్ కూడళ్ల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.


రన్ ఫర్ జీసస్‌లో పాల్గొన్న క్రైస్తవ సంఘ సభ్యులు